క్లుప్తంగా

నేడు విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా అన్నవరం, తూములూరు, బొమ్మువానిపాలెం, దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే శివకుమార్‌కు కృతజ్ఞతలు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తెనాలికి చెందిన నంబూరి వీరబ్రహ్మం శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వీరితో వైకుంఠపురం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్, శశి గ్రూపు సంస్థల అధినేత వృప్పల వరదరాజులు, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు, తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు ఉన్నారు.

రేపు పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి అర్బన్: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ సమావేశాన్ని ఆదివారం మధ్యాహ్నం 2.30గంటలకు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ నాయకులు కాశిదాసు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తన కుమార్తె తులసీ ప్రియాంక పుట్టిన రోజును పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలను పేదల మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం తులసీ ప్రియాంకకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుల కోటయ్య, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సినీ దర్శకుడు అనిల్ రావిపూడికి పురస్కారం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గల స్వామి వివేకానంద సెమినార్ హాలులో శనివారం సుప్రసిద్ధ చిత్రకారుడు, దర్శకుడు బాపు జయంతి సందర్భంగా 'బాపు–రమణ–బాలు కళాపీఠం' నిర్వహణలో బాపు స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభలో సినీ దర్శకులు అనిల్ రావిపూడికి బాపు స్మారక దర్శక కేసరి పురస్కారం, ప్రసిద్ధ చిత్రకారులు చిదంబరం, రామశాస్త్రి, కార్టూనిస్టు బొమ్మనకు బాపు స్మారక పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, కార్టూనిస్టులు, చిత్రకారులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

అరుణ్ కుమార్‌కు ఘంటసాల పురస్కారం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక, కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు ఘంటసాల పాటల్ని ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. అనంతరం కళావేదిక వ్యవస్థాపకులు మిరియాల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవాతత్పరులు నిశంకరరావు అరుణ్ కుమార్‌కు ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా కాపునాడు పార్లమెంట్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మేకల పురుషోత్తం ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని, చుక్కపల్లి వారి పాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ హాజరయ్యారు. దుగ్గిరాల గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి గ్యాస్‌స్టౌవ్, సిలెండర్, రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. సర్పంచులు సిద్ధిల ఉజ్వల శ్రీహరిణి, దాసరిసుందరమ్మ, ఈమని 1వ ఎంపీటీసీ సభ్యులు పి. కృష్ణ చైతన్య, ఈమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవల్లి, వ్యవసాయశాఖ గుంటూరు జిల్లా ఆత్మ పీడీ రామాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 12, 36 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



12వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 12వ వార్డు చినరావూరు–1 సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల హామీలను అమలు చేశారని చెప్పారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు వివరించారు. పథకాల ద్వారా వచ్చిన నగదును ఉపయోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. 12వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కొర్రయశోద మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు రూ.16.86కోట్ల సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణం క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- 36వ వార్డు గంగానమ్మపేట–2 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, వార్డు నాయకురాలు పోతిరెడ్డి హేమలత మాట్లాడుతూ 36వ వార్డులో ఇప్పటి వరకు రూ.13.04 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువరానిది



నివాళులర్పిస్తున్న హరికిషోర్, అనిల్‌కుమార్



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

తెనాలిఅర్బన్: ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువరానిదని ఆర్యవైశ్య యువత తెనాలి నాయకులు కొనియాడారు. అమరజీవి పొట్టిశ్రీరాములు 71వ వర్ధంతిని పురస్కరించుకుని మారీసుపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములును యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొప్పరావూరి హరికిషోర్, అప్పల అనిల్ కుమార్, నాని, దేసు రవికుమార్, చందోలు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు

తెనాలిటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం ఆర్యవైశ్య నాయకులు నిర్వహించారు. అలంకార్ టాకీస్ సెంటర్‌లో ఉన్న అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలు, త్యాగాలను కొనియాడారు. ఆర్యవైశ్య మహాసభ నాయకులు సాధు ప్రతాప్‌కుమార్, కొప్పరావూరి హరి కిషోర్, అనిల్ కుమార్, నాని, దేసు రవికుమార్, చందోలు శ్రీధర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు సాయిప్రీతి ఎంపిక



సాయిప్రీతిని అభినందిస్తున్న చైర్మన్ రామారావు

తెనాలిఅర్బన్: క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ చందు రామారావు పేర్కొన్నారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బొల్లు సాయిప్రీతి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ తైక్వాండో పోటీలకు ఎంపికైన నేపథ్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఇంటర్ యూనివర్శిటీ సౌత్ వెస్ట్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో సాయిప్రీతి తృతీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. అనంతరం ఆమెను ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ తైక్వాండో చాంపియన్ షిప్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినికి రూ.ఐదు వేల నగదు బహుమతితో సన్మానించారు. కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు, కోచ్ బందారు ధ్యానేశ్వరరావు, ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా చండీ హోమం

తెనాలిరూరల్: పెదరావూరు గ్రామంలోని మహా విద్యా పీఠంలో జగద్గురు ఆదిశంకరాచార్య సహిత అభయ హస్త సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. విద్యాపీఠం వ్యవస్థాపకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి.

రగ్గుల పంపిణీ



తెనాలి: రిమెంబర్ డిసెంబర్ నినాదంతో తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక జేఎంజే స్వధార్ కేంద్రంలోని అభాగ్యులు 60 మందికి రగ్గులు పంపిణీ చేశారు. రాజకుమార్ మిత్ర బృందం సహకారంతో స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వ్యక్తిగత కార్యదర్శి సునీల్, ఎన్నారై శంకరరావు, రజని దంపతులు, సిస్టర్ హృదయమేరి పాల్గొన్నారు. ప్రతివారు తమ వంతు బాధ్యతగా సంవత్సరం చివరిలో సేవచేయాలనే స్ఫూర్తిని చాటాలనే రిమెంబర్ డిసెంబర్ కార్యక్రమ ఉద్దేశంగా సునీల్ వెల్లడించారు.

దుస్తుల పంపిణీ



తెనాలి: డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మన ఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శేషిరెడ్డి, ఆయన మిత్ర బృందం విశ్రాంత ప్రిన్సిపల్ వాకా పేరిరెడ్డి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చిట్టూరి సీతారామయ్య, ఆర్‌అండ్‌బీ విశ్రాంత ఉద్యోగి విజయవర్ధన్‌రాజు పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తి, సంకల్పంతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు.

హిందూ ధర్మం విశ్వజనీయం

నరేంద్ర రామానుజదాసస్వామి



ప్రవచనం చేస్తున్న నరేంద్ర రామానుజదాసస్వామి

తెనాలిటౌన్: హిందూ ధర్మం విశ్వజనీయమని శరణాగతి గోష్ఠి పీఠాధిపతులు నరేంద్ర రామానుజదాసస్వామి పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివాలయం ప్రాంగణంలో శుక్రవారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. తెనాలి ఖండం ప్రముఖ్ కడియాల సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రామానుజదాసస్వామి ప్రవచనం చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు అయోధ్య నుంచి వచ్చిన అక్షితల స్పర్శ కార్యక్రమం అనంతరం జ్యోతి ప్రజ్వలన, భజన, సంకీర్తనలు జరిపారు. హిందూ ధర్మం వర్థిల్లాలి, జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ గ్రామ పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. హిందూ సమ్మేళనం సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ సంరక్షణ రాష్ట్ర కన్వీనర్ వెంకట ఆదిశేషయ్య, తెనాలి కన్వీనర్ అప్పికట్ల వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ విజ్జల సునీత, రామాంజనేయులు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం, హేమశంకరరావు, శ్రీవారు భక్తులు, భజన సంఘాల సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ ధార్మిక సభ్యులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో 'అన్నమయ్య శ్రీ వెంకటేస్వరం'



ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

తెనాలి: పద కవితా పితామహుడు, సంకీర్తనాచార్య అన్నమయ్య కీర్తనల ప్రచారంలో విశేషంగా కృషిచేస్తున్న పట్టణానికి చెందిన సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ ఈ నెల 17న 'అన్నమయ్య శ్రీవెంకటేస్వరం' సంగీత కార్యక్రమాన్ని నిర్వహించనుంది. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శుక్రవారం కార్యక్రమ ఆహ్వాన పత్రికను సంస్థ వ్యవస్థాపకుడు, గాయకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ పువ్వాడ సోమశేఖర్ ఆవిష్కరించారు. సంకీర్తన ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఏటా నిర్వహిస్తున్నట్లే అన్నమయ్య సంకీర్తనల గానం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు తనతోపాటు దివ్యశ్రీ, మాధురీలక్ష్మణ్, సుచరిత, దేవీలలిత, కృష్ణ, శ్రీలత, శ్రీకాంతి, రత్నప్రియాంక, ఆంజనేయశాస్త్రి అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తారని డాక్టర్ పురుషోత్తమరావు తెలియజేశారు. ప్రముఖ వాద్యకళాకారులు ఆంజనేయశాస్త్రి, శ్రీనివాస్, వెంకటరామకృష్ణ, వెంకటేశ్వరరావు, నాగప్రసాద్, అనిల్‌కుమార్, లక్ష్మీశంకర్, కుమార్‌బాబు వివిధ వాద్యాలతో సహకరిస్తారని వివరించారు. తెనాలి, పరిసరాల్లోని సంగీతాభిమానులు హాజరై అన్నమయ్య కీర్తనల మాధుర్యాన్ని ఆస్వాదించాలని కోరారు.

దోమల వ్యాప్తిని నియంత్రించాలి



మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు అందరూ సహకరించాలని మలేరియా తెనాలి సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ కోరారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో రజకపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో శుక్రవారం దోమల నియంత్రణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తి ఉంటే శరీరమంతా కప్పే దుస్తులను, దోమతెరలను వాడాలన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. నీటి నిల్వల్లో మడ్డి ఆయిల్, ఇతర నూనెలను పిచికారీ చేస్తే చాలా వరకు దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ఈ విషయాలన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, మలేరియా సూపర్‌వైజర్ డీఎస్.నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం వి.సృజనకుమారి, ఉపాధ్యాయులు ఎ.శివరామకృష్ణ, కె.చందన, సిబ్బంది పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో శాస్త్రోక్తంగా యాగాలు ప్రారంభం



యాగాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలయ ఏసీ, చైర్మన్ తదితరులు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాధ కుండాత్మక సప్తమ సహస్ర చండీ, మహా రుద్ర , నవగ్రహ, లక్ష్మీ, గణపతి మహా యాగాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయచయనులు పర్యవేక్షణలో శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు పూజా క్రతువు నిర్వహించనున్నట్లు ఏసీ తెలియజేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి హోమం, చండీపారాయణములు, అఖండ దీపారాధన, జపాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంటపారాధనలు, కుండ సంస్కారం, అగ్నిప్రతిష్ఠాపన, మూలసూత్ర హోమం, సహస్ర చండీ సప్తశతి హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో 50 మందికి పైగా ఋత్విక్కులు పాల్గొన్నారు.

మురుగు కాల్వల ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు

తెనాలిటౌన్: సచివాలయాలకు మంజూరైన నిధులతో గ్రామాల్లో ముఖ్యమైన పనులను చేయనున్నట్లు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో సచివాలయం–2 పరిధిలో మంజూరైన రూ.20లక్షలతో సిమెంటు సైడు కాల్వల ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో 12వ వార్డు ఇందిరాకాలనీ, చంద్రబాబు కాలనీ, జాషువా నగర్‌లో సీసీ రోడ్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు షేక్ షిలార్ జానీ, వార్డు సభ్యురాలు వేముల రమాదేవి, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు

క్రికెటర్ అంబటి రాయుడు



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మితో మాట్లాడుతున్న అంబటి రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని అన్ని హంగులతో ఆధునీకరించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలకు కొత్త రూపం తెచ్చారని, ఆధునిక డిజిటల్ చదువుల్ని తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాడు–నేడుతో పాఠశాలలో కల్పించిన వసతులు, ఆధునీకరించిన పాఠశాల భవన సముదాయాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో డ్యూయల్ డెస్క్‌లు, ఐఎఫ్ ప్యానెల్స్ పనితీరును ప్రత్యక్షంగా తిలకించారు. ప్రభుత్వ పాఠశాలల్ని గతంలో తాము ఎన్నడూ ఇంత గొప్పగా, ఇన్ని వసతులతో చూడలేదని అన్నారు. తరగతి గదుల్లో ఆధునిక ఫర్నీచర్, ఐఎఫ్ ప్యానెల్స్‌తో పాటు విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుంటున్నారని తెలిపారు. బ్లాక్ బోర్డు స్థానంలో ఐఎఫ్ ప్యానల్స్ ద్వారా ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్న తీరు అద్భుతంగా ఉందని చెప్పారు. పేద విద్యార్థుల జీవితాలను మార్చే ఆధునిక డిజిటల్ టెక్నాలజీలతో కూడిన ఇంగ్లిష్ మీడియం చెప్పిస్తున్న సీఎం వై.ఎస్. జగన్ రాష్ట్రంలో చదువుల విప్లవం తెచ్చారని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో గార్డెన్‌ను పరిశీలించారు. ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి, ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భార్యాభర్తల వివాదంపై కేసులు నమోదు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీయడంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన యలమంచిలి శ్రీనుకు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మతో 36 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో కొన్ని సంవత్సరాలుగా విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీను మరొక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈనెల 14న శ్రీను సహజీవనం చేస్తున్న మహిళతో తన ఇంట్లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న భార్య వెంకటేశ్వరమ్మ బంధువులు ఇదేమని శ్రీనును ప్రశ్నించారు. మాటామాటా పెరిగి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. ఈ మేరకు భార్యాభర్తలు ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డోకిపర్రు ఉర్దూ పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎం.డి ఖాసీం

మేడికొండూరు: మండల పరిధిలోని తురకపాలెంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మూల్యాకనం చేసిన సమ్మేటీవ్ అసెస్‌మెంట్ పరీక్ష పత్రాలను విద్యార్థులకు ఇచ్చారు. శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అమ్మ ఒడి అర్హులకు విద్యార్థుల హాజరు పరిగణలోకి తీసుకోవడం జరుగుతోంది, కాబట్టి తల్లిదండ్రులకు దీనిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మీజ్వాలా, అజీజ్, అయేషా, జాస్మిన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె

లక్ష్మీపురం: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. అరండల్‌పేటలోని హెడ్ పోస్టాఫీసు వద్ద రెండో రోజు తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె కొనసాగింది. ఆయన మాట్లాడుతూ తమ సమ్మెకు అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఎనిమిది గంటల పని, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాల్ని మంజూరు చేయాలని కోరారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, ఆర్థిక ఉన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ , గ్రాట్యూటీని రూ.5లక్షలకు పెంచాలని విన్నవించారు. పెయిడ్ లీవులను 180 రోజుల వరకు నగదుగా మార్చుకునే సౌకర్యం, జీడీఎస్ కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు.

విద్యుత్ పొదుపుతో బహుళ ప్రయోజనాలు

సీఆర్డీఏ సర్కిల్ ఏడీ కోటేశ్వరరావు



స్వయం సహాయక సంఘాల మహిళలకు బల్బులు అందజేస్తున్న ఏడీ కోటేశ్వరరావు

తాడికొండ: విద్యుత్‌ను పొదుపుగా వాడటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని సీఆర్డీయే సర్కిల్ విద్యుత్ శాఖ ఏడీ కేవీ కోటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసే పలు పద్ధతులు వివరిస్తూ ఫిలమెంట్ బల్బులు వాడకం పూర్తిగా తీసివేసి ఎల్ఈడీ స్టార్ రేటింగ్ బల్బులు, ఫ్యానులు వినియోగించాలని కోరారు. ఏసీని 25లో పెట్టి వినియోగించడం, 3 స్టార్, 4 స్టార్ రేటింగ్ ఏసీలు వినియోగించాలని, ఏసీ, టీవీ రిమోట్ ద్వారా కాకుండా స్విచ్‌ను కట్టివేయాలని పేర్కొన్నారు. పలువురు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు స్టార్ రేటింగ్ ఎల్ఈడీ బల్బులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రవి కుమార్, సబ్ ఇంజినీర్ నామా నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మరణం బాధాకరం

గుంటూరు ఎడ్యుకేషన్: రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదే సమయంలో ఎమ్మెల్సీ సాబ్జీ మరణ వార్త తెలియడంతో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆకస్మిక మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్. కుసుమకుమారి, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వి. శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ఏ.ఎల్. శివపార్వతి, జిల్లా కోశాధికారి ఎండీ. దౌలా, కార్యదర్శులు కె. సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, ఎం. గోవిందు, ఎం. కోటిరెడ్డి, ప్రభూజీ, పి. ప్రేమ్‌కుమార్, జి.వి. ధనలక్ష్మి, టి. ఆంజనేయులు, అడవి శ్రీనివాసరావు, యు. రాజశేఖరరావు పాల్గొన్నారు.